# 4

# బహుమతి

"ఏమిటి హైమా! పరీక్షలు దగ్గరకొస్తుంటే ఒకేసారి వారం రోజులు కాలేజికి ఆబ్సెంట్ అయ్యావు?" క్లాసులోకి రాగానే అటెండెన్స్ రిజిస్టరు తెరవబోయిన భవాని వెనుక బెంచీలో కూర్చున్న హైమను చూడగానే ఆప్రయత్నం విరమించి హైమను ప్రశ్నించింది.

హైమ మౌనంగా లేచి నిలబడి, సిగ్గుగా తలవంచుకుంది.

మిగతా అమ్మాయిలు కిసుక్కున నవ్వారు.

హైమను పరిశీలనగా చూసిన భవానికి పిల్లలు ఎందుకు నవ్వారో వెంటనే బోధపడింది.

హైమ ఒంటిమీద పట్టుచీర, తలలో పువ్వులు, మెడలో క్రొత్తగా మెరుస్తున్న బంగారు గొలుసూ, బుగ్గల్లోకి పాకుతున్న అరుణిమ... ఇవన్నీ ఆ అమ్మాయి కాలేజికి ఆబ్సెంటు అవడానికి గల కారణాన్ని చెప్పకనే చెప్తున్నాయి.

"ఊఁ అయితే నిశ్చితార్థం అయిపోయింది. త్వరలో మమ్మల్ని పెళ్ళికి పిలుస్తున్నావన్నమాట! కానీ పెళ్ళి సరదాలో పడి పరీక్షలు మాత్రం అశ్రద్ధ చేయకు సుమీ..." భవాని చిరునవ్వుతో అంది.

హైమ ఒకసారి తలెత్తి మేడమ్ వైపుచూసి తిరిగి తలదించుకుంది.

"రేపటి నుండి కాలేజి మానెయ్యమన్నారు మేడమ్. పరీక్షలు రాయనక్కర్లేదన్నారు.' గొణిగినట్టుగా అంది.

ఆ పిల్ల మాటలతో ఎక్కడా చదువుకుంటుపడుతోందన్న ఆరాటం కానీ, పరీక్షలు రాయలేకపోతున్నానన్న బాధగానీ వినిపించలేదు. అదేదో చాలా మామూలు విషయమన్నట్టు చెప్పింది.

భవాని చిన్నగా నిట్టూర్చి "క్లాసు అయ్యాక నా రూముకు ఒకసారి రా హైమా..! అనేసి పాఠం మొదలు పెట్టింది.

* * *

మధ్యాహ్నం లంచ్ అవర్‌లో భవాని గదికి వచ్చింది హైమ.

అపుడే భోజనం ముగించిన భవాని, హైమను చూడగానే "లోపలకిరా హైమా!" అంది ఆప్యాయంగా.

హైమ సంకోచంగా లోపలికి తొంగిచూసింది.

"ఎవరూ లేరులే.. ఫరవాలేదు రా... ఇలా వచ్చి కూర్చో... కాసేపు నేను మేడమ్‌ని నువ్వు స్టూడెంటువి అన్న విషయం మర్చిపో. ఒక స్నేహితురాలితో మాట్లాడుతున్నాననుకో.. ఏం?" భవాని చనువుగా హైమ చెయ్యి పట్టుకుని లోపలికి తీసికెళ్ళి తన ఎదురుగా కుర్చీలో కూర్చో బెట్టింది.

లెక్చరర్ ఎదురుగా కుర్చీలో కూర్చోవడం ఇబ్బందిగా వుంది హైమకు.

కానీ మేడమ్ మాట కాదనకలేక కుర్చీ అంచుమీద ఒదిగి కూర్చుంది.

"ఇప్పుడు చెప్పు హైమా! నీకు పరీక్షలు రాసి డిగ్రీ తెచ్చుకోవాలని వుందా లేదా?"

అనునయంగా అడిగింది భవాని.

"నాకు ఇష్టమైతే ఏం లాభం మేడమ్? వాళ్ళు ఒప్పుకోవడం లేదు." ఆ టాపిక్ గురించి మాట్లాడం ఇష్టం లేనట్టుగా క్లుప్తంగా జవాబిచ్చింది హైమ.

'కాబోయే శ్రీవారి అందచందాల గురించీ, చదువు సంధ్యల గురించీ, పెళ్ళికి కొంటున్న చీరెల గురించీ, చేయిస్తున్న నగల వివరాలు అడిగితే ఉత్సాహంగా జవాబు చెప్పేది ఈ అమ్మాయి' అనుకుంది భవాని.

"అదికాదు హైమా! మూడేళ్ళు కష్టపడి చదివావు. ఇంకో నెల్లాళ్ళ కష్టపడితే డిగ్రీ చేతికొస్తుంది. నీ కాళ్ళమీద నువ్వు నిలబడడానికి ఆధారమొకటి వున్నదన్న కాన్ఫిడెన్స్ వస్తుంది. అవునా? నచ్చజెప్పడానికి ప్రయత్నించింది భవాని.

"నేను ఉద్యోగం చేయడానికి వీల్లేదని ముందే ఖండితంగా చెప్పేసారు మేడమ్. ఆయనకు మంచి ఉద్యోగం వుంది. అందుకే ఇక పరీక్షలు రాయడం అనవసరం అన్నారు. అమ్మావాళ్ళుకూడా అలాగే కాలేజి మాన్పిస్తామని ఒప్పుకున్నారు! కొద్దిగా అసహనంగా కదిలి అంది హైమ.

భవాని చిన్నగా నవ్వింది. "అంటే చదువుకోవడం ఉద్యోగం కోసమేనా? ఉద్యోగం చేయవలసిన అవసరం లేకపోతే చదువుకోనవసరం లేదంటావా?" అనడిగింది.

"చదువు నాలెడ్జి కోసమే అయితే ఇన్నాళ్ళు చదువుకున్నానుగా మేడమ్! ఇక డిగ్రీ, గురించి, పరీక్షల కోసం వాళ్ళతో గొడవ పెట్టుకోవడం దేనికి చెప్పండి? వాళ్ళకి ఇష్టంలేదని స్పష్టంగా చెప్పారు. అమ్మావాళ్ళు కూడా ఒప్పుకున్నారు" ఇక ఆ విషయం గురించి మాట్లాడ్డానికి ఏమీలేదన్నట్టు అంది హైమ.

ఆ అమ్మాయి అవివేకం చూసి భవాని మనసు చివుక్కుమంది.

"ఈ కాలం ఆడపిల్లలు బయటి ప్రపంచాన్ని గురించి టి.వి.లో చూస్తున్నారు. పత్రికలు, నవలలు చదువుతున్నారు. సినిమాలు చూస్తున్నారు. పేపర్లో రోజూ వార్తలు చదువుతున్నారు. ఆడవాళ్ళ కన్నీటి కథలు వింటూనే వున్నారు. కానీ అవేవీ మాకు

సంబంధించినవి కావు అన్నట్టు పెళ్ళి అనేసరికి రంగుల కలలు కంటూ, తలవంచి తాళి కట్టించుకోవడమే భాగ్యమన్నట్టు తలున్తున్నారు. స్వశక్తి మీద బ్రతకగల ఆధారం ఒకటి తమకు ఏర్పరచుకున్నాకే పెళ్ళి అనేమాట తలపెడితే ఎందరో అభాగినుల జీవిత కథలు మరొకరకంగా వుండేవని వీరికి ఎవరు ఎలా నచ్చచెప్పాలి?" అనుకుంటూ దీర్ఘంగా నిట్టూర్చింది భవాని.

"మిగతా లెక్చరర్స్ వస్తున్నారు. ఇక నేను వెళ్తాను మేడమ్." అంటూ లేచింది హైమ.

"అలాగేగానీ రేపొకసారి మా ఇంటికి రాకూడదూ? నీ పెళ్ళికి నేను రాగలనోలేదో! నా లైబ్రరీలో నీకు నచ్చిన పుస్తకం సెలక్ట్ చేసుకుందువు. నీ పెళ్ళికానుకగా అన్నమాట" భవాని ప్రసన్నంగా నవ్వేసి అంది.

హైమ ముఖంలోకి కాంతి వచ్చింది ఈ మాటలు వినగానే.

"మీ ఇంటికి వస్తానుగానీ మీరు మాత్రం పెళ్ళికి తప్పక రావాలి మేడమ్." అంది ఉత్సాహాన్ని చిరుసిగ్గు కప్పివేస్తుండగా.

"అలాగే ప్రయత్నిస్తానులే.. రేపు సాయంత్రం డిపార్ట్‌మెంటుకు వచ్చేయి. ఇద్దరం కలిసి మా ఇంటికి వెళ్దాం." అనేసి పుస్తకంలోకి తలదూర్చింది భవాని.

* * *

సాయంత్రం భవాని ఇంటికి వచ్చేసరికి పద్మ లోపలి గదిలో ఒకమూలగా పడుకొని వుంది.

'పద్మా... సాయంత్రంపూట పడకేమిటమ్మా? టైముదొరికినప్పుడల్లా పుస్తకాలు పట్టుకోమన్నానా? పిల్లలేరి?" కాళ్ళు, ముఖం కడుక్కుని వచ్చి కూర్చుంటూ అడిగింది భవాని.

వదినగారి రాకను గమనించని పద్మ, ఆమె మాటలు విని వులిక్కిపడి లేచి కూర్చుంది.

ఎఱ్ఱగావున్న ఆమె కళ్ళు ఆవిడ చాలాసేపుగా ఏడుస్తున్నట్టు చెప్తున్నాయి.

ముప్పై నాలుగేళ్ళ వయసులోవున్న పద్మ చక్కని ఛాయతో అందంగా వున్నా బొట్టులేని ఆమె ముఖం కళావిహీనంగా కనబడుతూంది.

"మధ్యాహ్నమంతా చదువుకున్నాను వదినా. ఇప్పుడే పిల్లలు ఆటలకు వెళ్తే తలనొప్పిగా వుందని కాసేపు పడుకున్నాను. మీకు కాఫీ తీసుకువస్తానుండండి" తడబడుతూ జవాబిచ్చి వంటిట్లోకి నడిచింది పద్మ.

మరదలి ముఖం చూస్తుంటే భవాని మనసు కరిగి నీరైపోయింది.

పన్నెండేళ్ళ క్రిందట క్రొత్తగా పెళ్ళై అత్తగారింటికి వచ్చిన పద్మ ప్రపంచంలోని ఆనందమంతా తనసొత్తేనన్నంత సంతోషంగా వుండేది.

మంచి ఉద్యోగంలోవున్న భర్త, తల్లి తండ్రులలా ఆదరించే అత్తమామలుగల తను ఎంతో అదృష్టవంతురాలినని పొంగిపోయేది.

తమ్ముడి పెళ్ళైన ఏడాది తరువాత వారి వివాహ వార్షికోత్సవానికి పుట్టింటికి వచ్చిన భవాని మాట వరుసగా పద్మతో అంది. 'పద్మా నీ చిన్న మరిది ఇంటరు పరీక్షరాస్తున్నాడు కదా... నువ్వూ వాడితోబాటు పరీక్షరాసి ఆ ఇంటర్ మీడియట్ ముగించకూడదూ? తరువాత కావాలంటే నెమ్మదిగా ప్రైవేటుగా డిగ్రీకి కట్టొచ్చు" అని.

పద్మ వదినగారి మాటలు నచ్చనట్టుగా అయిష్టంగా చూసింది.

"అబ్బ! ఉద్యోగంచేస్తూ మీరెంత సుఖపడుతున్నారో చూస్తున్నాగా వదినా? మీరేగా అంటుంటారు ఇంట్లో మొగుడికీ పిల్లలకూ చాకిరీ, బయట కాలేజిలో పని నలిగిపోతున్నా అంటూ, నాకు ఆ చదువూ వద్దు. మీలాటి ఆ అవస్థా వద్దు..." అంది కచ్చితంగా.

ఎపుడో విసుగు పుట్టినపుడు తను యథాలాపంగా అన్న మాటలను ఆ పిల్ల తన ముఖంమీదే తిప్పికొట్టేసరికి భవాని ముఖం చిన్నబోయింది.

"దానికి ఇష్టం లేనపుడు నీకెందుకే ఈ తాపత్రయం? వాడి పెళ్ళాం సంగతి వాడు చూసుకుంటాడులే.." అంటూ కూతుర్ని సముదాయించింది భవాని తల్లి.

'అదృష్టవంతురాలు! కోడల్ని ఈ దురవస్థలో చూడకముందే కన్నుమూసింది.." ఆలోచనల నుండి తేరుకుంటూ అనుకుంది భవాని.

* * *

మర్నాడు సాయంత్రం కాలేజి అయ్యాక భవాని దగ్గరకు వచ్చింది హైమ.

'ఆ అమ్మాయిని తీసుకువస్తున్నట్టు ఇంట్లో చెప్పి వచ్చి వుంటే బాగుండేది" అనుకుంటూ ఇంటికి బయలుదేరింది భవాని.

వాళ్ళిద్దరూ ఇంట్లోకి అడుగుపెట్టేసరికి హాల్లో కుర్చీలో ముడుచుకు కూర్చుని కనబడింది పద్మ.

ఆమె చేతిలో పుస్తకం అయితే వుందిగానీ కళ్ళు మూసుకుని వుంది.

మూసుకున్న కళ్ళలో నుండి కన్నీరు చెంపలమీదకు కారిపోతున్నది.

అతిథిని వెంటబెట్టుకుని వచ్చిన భవాని ఇబ్బందిగా ఫీలైంది.

"పద్మా! ఏమిటమ్మా ఇది? ఎన్నిసార్లు చెప్పినా ఇంతేనా? నువ్వు ధైర్యం తెచ్చుకోవాలి. ఇలా అయితే నిన్ను పరీక్ష గట్టెక్కించడం నావల్లకాదమ్మా..." అంటూ ప్రేమగానే కోప్పడింది.

అంతలోనే గొంతు మృదువుగా మార్చి "ఇదిగో నాకూడా ఎవరొచ్చారో చూడు! హైమ అని నా స్టూడెంటు. ఈ అమ్మాయికి వచ్చేనెలలో పెళ్ళట. ముందుగానే కానుక ఇస్తానని ఇంటికి తీసుకువచ్చాను. ఆ అమ్మాయికి కాస్త టిఫినో కాఫీయో ఇవ్వవూ?" అంది.

పద్మ గభాలున లేచి కొంగుతో ముఖం తుడుచుకుంది.

'ఒక్క నిముషంలో తీసుకువస్తా వదినా.. మీరు మాట్లాడుకుంటూ వుండండి" అని వంటింట్లోకి వెళ్ళింది.

"కూర్చో హైమా! కాఫీ త్రాగి నా పుస్తకాలు చూద్దువుగానీ.." అంది భవాని.

పద్మను ఆ స్థితిలో చూసిన హైమకు మనసులో ఏమిటో గుబులుగా అనిపించింది.

కానీ ఎలా అడగాలో తెలీక అటూ ఇటూ చూస్తూ కూర్చుంది.

అంతలో పదేళ్ళ రవి, ఏడేళ్ళ రమ పరిగెత్తుకుంటూ బయట నుండి లోపలికివచ్చారు.

"అత్తా! చాక్లెట్లు తెచ్చావా?" అనడిగారు ఇద్దరూ కోరస్‌గా భవాని దగ్గరగా వచ్చి.

"తెచ్చాను గానీ అమ్మని అలా ఒంటరిగా వదిలేసి ఆటలకు వెళ్ళిపోవద్దని చెప్పానా?" పిల్లల్ని దగ్గరకు తీసుకుంటూ అడిగింది భవాని.

"మరీ.. అమ్మేమో నాన్న కోసం ఏడుస్తుంది. మమ్మల్ని చూస్తే ఇంకా ఏడుస్తుందని ఆడుకోవడానికి వెళ్ళిపోయాం అత్తా!" బిక్క ముఖం పెట్టి అన్నాడు రవి.

'సరేలే మీరు వెళ్ళి ఆడుకోండి" చాక్లెట్లు ఇచ్చి పిల్లల్ని బయటకు పంపించింది భవాని.

ఇంతలో పద్మ ప్లేటులో బిస్కెట్లు, రెండు కప్పులు కాఫీ తీసుకువచ్చి వాళ్ళిద్దరి నడుమవున్న టీపాయ్ మీద పెట్టింది.

"కాఫీ తీసుకో హైమా" అని చెప్పి భవాని పద్మవైపుచూస్తూ" ఇదిగో కొశ్చన్ పేపరు సెట్ చేసాను. తీసికెళ్ళి నీకు వచ్చినవేవోరాయి చూద్దాం... ఇంతవరకు చదివిన పాఠాలు ఏమాత్రం నేర్చుకున్నావో చూద్దాము." చిన్న పిల్లతో అన్నట్టుగా అంది.

పద్మ పేపరు తీసుకుని లోపలికి వెళ్ళిపోయింది.

"మేడమ్! ఆవిడ మీకు..." ప్రశ్నార్థకంగా ఆగిపోయింది హైమ.

"మా తమ్ముడి భార్య, పెళ్ళై పన్నెండేళ్ళయింది. అర్నెల్ల క్రిందట మా తమ్ముడు జాండీసు వచ్చి చనిపోయాడు. ఇద్దరు పిల్లలతో ఈవిడ ఇలా మిగిలిపోయింది. టేబులు మీదవున్న తమ్ముడి ఫోటోను చూపిస్తూ విషాదంగా అంది భవాని.

'అయ్యో..." అప్రయత్నంగానే అంది హైమ. "మరి ఇప్పుడు ఆవిడను చదువుకోమంటున్నారేమిటి?" సందేహంగా చూసింది.

"అవును హైమా! మావాడు పనిచేసిన ఆఫీసులోనే పద్మకు ఉద్యోగం ఇస్తానన్నారు. డబ్బు అవసరమొక్కటే కాకుండా ఇంత చిన్న వయసులో తనకంటూ ఒక వ్యాపకం లేకపోతే తన జీవితం దుర్భరమైపోతుందన్న ఆలోచనతో కూడ తనని ఉద్యోగంలో చేరమంటున్నాము. కానీ పెళ్ళికి ముందు పద్మ ఇంటరు ఫెయిలై మళ్ళీ పరీక్ష రాయనంటూ వదిలేసిందిట. ఈ ఉద్యోగానికి కనీసం ఇంటరు పాసైవుండాలి. 'అందుకని ఎలాగో నచ్చజెప్పి పరీక్షకు కట్టిస్తున్నాను" అంది భవాని బరువుగా. హైమ మాట్లాడకుండా కూర్చుండిపోయింది.

"సారీ హైమా! నువ్వేదో ఉత్సాహమైన మూడ్‌లో వస్తే మా పర్సనల్ ప్రాబ్లమ్స్ చెప్పి మనసు కష్టపెట్టానేమో.. ఏమీ అనుకోకు. పద పుస్తకాలు చూసి నీకు కావలసిన పుస్తకం తీసుకుందువు. ఇంతకీ నీకు తెలుగు సాహిత్యం ఇష్టమా?" మాట మార్చేసి హైమను తన గదిలోకి తీసుకువెళ్ళింది భవాని.

"మీ అంకుల్ నేనూ కలిసి పదహారేళ్ళ శ్రమ ఫలితంగా నిర్మించుకున్న లైబ్రరీ ఇది. మా అబ్బాయికూడా మాలాగే పుస్తకాల పురుగు" నవ్వుతూ అంది భవాని.

హైమ ఏదో ఆలోచనలో వున్నట్టుగా పరధ్యానంగా వుండిపోయి జవాబివ్వలేదు.

* * *

వారం రోజుల తరువాత తిరిగి క్లాసులో కనబడిన హైమను చూసి ఆశ్చర్యపోయింది భవాని.

"శుభలేఖలు ఇవ్వడానికి వచ్చావా హైమా?" ఆప్యాయంగా అడిగింది.

"లేదు మేడమ్ నేను పరీక్షలు రాస్తానని చెప్పి ఒప్పించి వచ్చాను మేడమ్. పరీక్షలయింతరువాతే ముహూర్తం పెట్టారు." సిగ్గుపడి తలవంచుకోకుండా భవాని ముఖంలోకి సూటిగా చూస్తూ చెప్పింది హైమ.

భవాని ముఖం సంతోషసంభ్రమాలతో వెలిగింది.

"నిజంగానా హైమా? చాలా సంతోషం.. చూస్తూ వుండు పట్టుదలతో చదివావంటే నీకు ఫస్టుక్లాసు గ్యారంటీ. ఫస్ట్ క్లాస్‌లో గనుక పాసైతే నీకు మంచి బహుమతి ఇస్తాను నేను." భవాని సంతోషంగా అంది.

"నాకు డిగ్రీవస్తే అది నాకు మీరిచ్చిన బహుమతే అవుతుంది మేడమ్" మనస్ఫూర్తిగా అంది హైమ.

ఆనందంతో మాటలు పెగలక అలాచూనస్తూ ఒక క్షణకాలం కూర్చుండిపోయింది భవాని.

*• A.I.R. Kurnool - 11-8-1995 •*